సాక్షి
కాకినాడ

శుక్రవారం । 24 । జనవరి । 2025



ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు.


II లో



జోరుగా గొలుసుకొట్టు చోరీలు

జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు.

డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.15 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



రాంబాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అందువల్లనే ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. తొండంగి మండలం బెండపూడికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, వృద్ధుడు మల్ల రాంబాబుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. దీంతో అతడిని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్యకర్తలతో కలిసి ఆసుపత్రికి వెళ్లి రాంబాబును దాడిశెట్టి రాజా పరామర్శించారు. రాంబాబుపై దాడిని ఖండిస్తున్నామని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని రాజా భరోసా కల్పించారు.

ఫిబ్రవరి 24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన సామర్లకోట బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 24 నుంచి మార్చి ఒకటోల తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. స్థానిక విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో భక్తులతో సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఫిబ్రవరి 24వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణం, 26న మహాశివ రాత్రి, 27న రథోత్సవం, మార్చి 1న స్వామి వారి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై భక్తుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. ఆలయానికి నిత్యం వచ్చే భక్తులు ఈ సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఈఓ కోరారు.

రెచ్చిపోయిన మట్టి మాఫియా

మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న వీఆర్వోపై దౌర్జన్యం

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న వీఆర్వోపై మట్టి ట్రాక్టర్ డ్రైవర్లు దౌర్జన్యానికి దిగారు. స్థానికుల సమాచారం ప్రకారం.. గ్రామ శివారున పంట పొలాల నుంచి ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లతో మట్టిని వెలికితీసి సమీపంలోని లే అవుట్‌కు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న స్థానిక వీఆర్వో ధర్మరాజు అక్కడకు చేరుకుని, మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు వీఆర్వోపై దౌర్జన్యానికి దిగారు. అడ్డు తప్పుకోకపోతే ట్రాక్టర్‌తో ఢీకొట్టి వెళ్లిపోతామని బెదిరింపులకు దిగారు. వీఆర్వో ఒక్కరే ఉండటంతో వారు మట్టి ట్రాక్టర్లను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

26న చదరంగం పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సెకండ్ వరల్డ్ చెస్ అకాడమీ ఆధ్వర్యాన ఈ నెల 26న జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జంజం సాయికుమార్ గురువారం తెలిపారు. కాకినాడ సూర్య కళా మందిరంలో అండర్–7, 9, 11, 13, 15 విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.300 రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాలని తెలిపారు. టోర్నీలో పాల్గొనే వారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 95781 99777, 90101 50640 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లండన్ జాబ్ పేరిట రూ.12 లక్షలకు టోకరా

కాకినాడ క్రైం: లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడు. కాకినాడ వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక జగన్నాథపురానికి చెందిన కె.దశరథుడు కుమారుడు వర్మ బీటెక్ పూర్తి చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌తో దశరథుడికి కొన్నాళ్లుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో వర్మకు లండన్‌లో ఉద్యోగం వేయిస్తానని హర్షవర్ధన్ నమ్మబలికి, 2023లో దశరథుడి నుంచి రూ.12 లక్షలు తీసుకున్నాడు. అప్పటి నుంచీ రేపు మాపు అంటూ కాలం గడుపుతున్నాడు. తాము మోసపోయామని గ్రహించిన దశరథుడు తమ డబ్బు తిరిగివ్వాలని అడిగాడు. అయితే హర్షవర్ధన్ నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో పోలీసుల్ని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

● పేరు మార్పుతో సరి..

ఎన్టీఆర్ జల కిరికిరి



పాతాళగంగ.. పంటను తడుపుతోందిలా.. (వైఎస్సార్ జలకళ పథకం ద్వారా గొల్లప్రోలు మండలంలో వేసిన ఉచిత బోరు)

- రైతులకు 'జల్' కొట్టిన కూటమి సర్కార్
- 'ఎన్టీఆర్ జలసిరి'గా మారిన 'వైఎస్సార్ జలకళ'
- ఏడు నెలల్లో ఒక్క బోరూ లేదు
- అన్నదాతలకు తప్పని నీటి కష్టాలు
- పట్టించుకోని పాలకులు

పిఠాపురం: కేవలం వర్షాధారంగానే సాగు జరిగే మెట్ట ప్రాంతంలో పైరు పచ్చగా ఉండాలంటే పాతాళగంగే ఆధారం. దానిని పైకి తీసుకుని వచ్చి.. పంట చేలను తడపాలంటే బోర్లు వేసి తోడటమే ప్రస్తుతం రైతుకు ఉన్న ఏకైక మార్గం. అయితే, దీనికయ్యే పెట్టుబడి అన్నదాతకు తలకు మించిన భారమే అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అటువంటి రైతులను ఆదుకునే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం రూపొందించి, పక్కాగా అమలు చేసింది. చిన్న, సన్నకారు రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ ఉచిత బోరు బావుల పథకాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2020 సెప్టెంబర్ 28న ప్రారంభించారు. నీటి ఎద్దడి అధికంగా ఉండే మెట్ట ప్రాంత భూముల్లో ఉచితంగా బోర్లు వేసి, రైతుల సాగునీటి కష్టాలు తీర్చారు. తద్వారా వర్షం పడితేనే కానీ పంటలు సాగు చేయలేని రైతులకు ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం కల్పించారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ఇలా..

ఈ పథకం కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లావ్యాప్తంగా 3,118 దరఖాస్తులు రాగా.. 1,326 ధ్రువీకరణ పొందాయి. వీటిలో పరిపాలనా ఆమోదం 1,306 పొందగా.. అత్యధిక అవసరమున్న రైతులకు సుమారు రూ.15 కోట్లతో 926 బోర్లు ఉచితంగా వేశారు. కేవలం భూగర్భ జలాలపైనే ఆధారపడి సాగు చేస్తున్న వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి, యుద్ధప్రాతిపదికన బోర్లు మంజూరు చేశారు. ఇలా వేసిన బోర్లకు విద్యుత్ కనెక్షన్ వేయించుకున్న రైతులకు ప్రత్తిపాడు, కాకినాడ, కత్తిపూడి క్లస్టర్ల పరిధిలో 99 మోటార్లు ఉచితంగా అందజేశారు. మిగిలిన రైతులకు బోర్లు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం మూడు ఎకరాలు.. ఆరు పంటలుగా సాగింది.

కూటమి ప్రభుత్వ హయాంలో ఇలా..

ఈ పరిస్థితుల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాధినేతలు రైతు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అన్నదాతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గడచిన ఏడు నెలల్లో తుంగలో తొక్కేయడంతో పాటు.. అప్పటి వరకూ అమలవుతున్న పథకాలను కూడా అటకెక్కించేశారు. ఇందులో భాగంగానే వైఎస్సార్ జలకళ పథకాన్ని కూడా నీరుగార్చేశారు. ఎన్టీఆర్ జలసిరిగా ఈ పథకం పేరు మార్చి, అక్కడితో చేతులు దులుపేసుకున్నారు. కనీసం పథకం విధివిధానాలను కూడా నిర్ణయించలేదు. బంగాళాఖాతంలో తుపానులు ఏర్పడితే తప్ప ఈ సీజన్‌లో పెద్దగా వర్షాలుండవు. మరోవైపు జలాశయాల ద్వారా సాగునీరు కూడా పూర్తి స్థాయిలో అందే పరిస్థితి ఉండదు. దీంతో జిల్లాలోని రబీ రైతులు సాగునీటి ఎద్దడి ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉచిత బోర్ల పథకం అమలు చేస్తే తమకెంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. కానీ, ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యం చూపుతూండటంతో బోరు బావులు పూర్తి స్థాయిలో లేక పంట చేలు నెర్రెలు తీస్తున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత బోర్ల పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వెంటనే అమలు చేయాలి



ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆయన ఆశయాలను పాతాళంలోకి తొక్కేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చడం తప్ప అమలు చేయడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రైతులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని వెంటనే అమలు చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

– **తిరుమలశెట్టి నాగేశ్వరరావు**, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

అమలులో లేదు



భూగర్భ జలాలతో పంటలు పండించుకునే రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించేలా ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ పథకం ప్రస్తుతం అమలులో లేదు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వెంటనే అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తాం. పథకం అమలులో లేకపోవడంతో రైతుల నుంచి ఎటువంటి దరఖాస్తులూ తీసుకోవడం లేదు.

– **అడపా వెంకటలక్ష్మి**, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, కాకినాడ

రత్నగిరికి తగ్గిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: సంక్రాంతి సందడి ముగియడంతో రత్నగిరికి భక్తుల రాక కాస్త తగ్గింది. ఏటా పుష్య మాసం ప్రారంభమయ్యాక సంక్రాంతి పండగ వరకూ సత్యదేవుని సన్నిధిలో రద్దీ ఉంటుంది. సంక్రాంతి సెలవులకు స్వస్థలాలకు వచ్చే వారు పనిలో పనిగా దేవాలయాలను కూడా దర్శించుకుంటారు. ఈ క్రమంలో సత్యదేవుని ఆలయానికి గత వారం భక్తుల రద్దీ పెరిగింది. సంక్రాంతి అనంతరం స్వస్థలాల నుంచి ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో ప్రస్తుతం భక్తుల సంఖ్య సాధారణంగానే ఉంది. ఈ నెల 30వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభం కానుండటంతో రద్దీ మళ్లీ పెరగనుంది.

సత్యదేవుని ఆలయాన్ని గురువారం 20 వేల మంది భక్తులు దర్శించి, పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతాలు 800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులు గురువారం ఎటువంటి స్వర్ణాభరణాలు లేకుండా నిజరూపంలో దర్శనమిచ్చారు. రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి చండీ హోమం నిర్వహిస్తారు.

కొనసాగుతున్న చికిత్స

కాకినాడ క్రైం: కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల్లో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం తెల్లవారుజామున కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. శ్రీకాకుళానికి చెందిన చెల్లూరి కోటేశ్వరరావు, తలియ ధనలక్ష్మి, రేణుకలను జీజీహెచ్‌లో చేర్చారు. అయితే, రేణుకను ఆమె కుటుంబ సభ్యులు స్థానిక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోంది.

లోటస్ ట్రావెల్స్‌కు రూ.1.97 లక్షల జరిమానా



బస్సును తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

ప్రత్తిపాడు: ఇటీవల ప్రత్తిపాడులో ప్రమాదానికి గురైన లోటస్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి రవాణా అధికారులు రూ.1.97 లక్షల జరిమానా విధించారు. జాతీయ రహదారిపై పాదాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లోటస్ ట్రావెల్ బస్సు టైర్ పేలి, పంట పొలాల్లోకి దూసుకుపోయిన విషయం తెలిసిందే. ఈ బస్సును కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. దీనికి రోడ్ ట్యాక్స్ కానీ, ఇన్సూరెన్సు కానీ లేవు. ఈ నేపథ్యంలో లోటస్ ట్రావెల్స్ యాజమాన్యానికి రూ.1.97 లక్షల జరిమానా విధించామని శ్రీనివాస్ తెలిపారు.

చేతి రాత.. భవిష్యత్ నిర్ణేత

- జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్
- పిఠాపురంలో జిల్లా స్థాయి చేతిరాత పోటీలు

పిఠాపురం: చేతి రాతే భవిష్యత్తును నిర్ణయిస్తుందని, తలరాతను మారుస్తుందని జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) పిల్లి రమేష్ అన్నారు. జాతీయ చేతి రాత దినోత్సవం సందర్భంగా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి చేతి రాత పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ పోటీలను 3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతుల వారిని జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల వారిని సీనియర్స్‌గా పరిగణించి నిర్వహించారు. మూడు విభాగాల్లో సుమారు 500 మంది విద్యార్థులు, 68 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా సైన్స్ అధికారి మైలపల్లి శ్రీనివాస్, జిల్లా చేతి రాత సమన్వయకర్త బొడ్డు అబ్రహం హాన్స్ పర్యవేక్షించారు. విద్యార్థులందరికీ బ్రౌజ్ సంస్థ బహుమతులు అందజేసింది. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు యాహ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస వినీల్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

తొలి నాలుగు స్థానాల విజేతలు

సబ్ జూనియర్స్: బి.వెంకట్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పిఠాపురం. ఎ.శశికళ, జెడ్పీ హైస్కూల్, మల్లాం. కె.మహాలక్ష్మి, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, సామర్లకోట. ఎస్.జ్యోతి కమల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, ధర్మవరం.

జూనియర్స్: ఎస్.జోషిత, జెడ్పీ హైస్కూల్, తాళ్లరేవు. ఇ.అచ్చారత్నం, జెడ్పీ హైస్కూల్, శంఖవరం. పి.సత్య శ్రావణి, జెడ్పీ హైస్కూల్, పి.దొంతమూరు. వి.లక్ష్మీ గంగా దుర్గ, జెడ్పీ హైస్కూల్, మల్లాం.

సీనియర్స్: ఎం.నాగాంజలి, మున్సిపల్ బాలికల హైస్కూల్, పిఠాపురం. కె.సంధ్యారాణి, జెడ్పీ హైస్కూల్, పి.దొంతమూరు. పి.మౌనిక సాయి, జెడ్పీ బాలికల హైస్కూల్, తుని. బి.లిప్సిక, జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సామర్లకోట.

గిరిజన, అటవీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: గిరిజనుల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందుపర్చిన పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డు ఏరియాస్ (పెసా) చట్టం, అటవీ హక్కుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లో 38 మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను ఆయన గురువారం ఈటీసీలో ప్రారంభించారు. నాలుగు బ్యాచ్‌లలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లోని ఎంపీడీఓ, ఈఓ పీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని అధికారులకు, గిరిజనులను వారి హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, పంచాయతీరాజ్ జేడీలు శ్రీదేవి, రమణ, డీడీ రామనాథం పాల్గొన్నారు. వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు శిక్షణ ఇచ్చారు.

పరిశోధన స్థానం శాస్త్రవేత్తలకు జాతీయ స్థాయి అవార్డు

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు జీవ నియంత్రణ చర్యలపై జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతి రావు గురువారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ఐసీఏఆర్, ఎన్‌బీఏఐఆర్ సొసైటీ ఫర్ బయో కంట్రోల్ అడ్వాన్స్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ చందీష్ ఆర్ బళ్లాల్ టీమ్‌కు అవార్డు ఫర్ అవుట్ స్టాండింగ్ ఎక్స్‌టెన్షన్ వర్క్ ఇన్ బయాజికల్ కంట్రోల్ టీమ్ లభించిందన్నారు. వచ్చే నెల 25 నుంచి 27 వరకు జరగనున్న కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. కేంద్ర అధిపతి చలపతిరావుతో పాటు తెగుళ్ల విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నీరజ, డాక్టర్ వి.గోవర్ధనరావు, ఉద్యాన విభాగ శాస్త్రవేత్త ఎ.కిరీటీ, కీటక విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, డాక్టర్ పి.సునీత అవార్డును అందుకుంటారన్నారు. కొబ్బరి, కోకోలో జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై జరిగిన పరిశోధనలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించండి సార్!

- దేవదాయ శాఖ కమిషనర్‌గా రామచంద్ర మోహన్
- గతంలో అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన అనుభవం
- ఇక్కడి సమస్యలపై దృష్టి పెట్టాలని సిబ్బంది ఆశాభావం



అన్నవరం దేవస్థానం



అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి కార్యదర్శి, కమిషనర్‌గా పని చేసిన ఎస్.సత్యనారాయణను బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. రామచంద్ర మోహన్ గతంలో రెండు దఫాలు అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన విషయం విదితమే. ఇప్పుడు ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమితులవడంతో అన్నవరం దేవస్థానం సమస్యలపై ఆయన దృష్టి సారించాలని ఇక్కడి సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం

అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన కాలంలో రామచంద్ర మోహన్ వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2010–12 మధ్య దేవస్థానంలో రూ.15 కోట్లతో 135 గదుల హరిహర సదన్ సత్రం, 36 హాల్స్‌తో విష్ణు సదన్ వివాహ మండపాల భవనం నిర్మించారు. అలాగే, 2023–24 మధ్య ఈఓగా పని చేసినప్పుడు రూ.3 కోట్లతో ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఏటా కార్తిక పౌర్ణమి నాడు ఉదయం 7 గంటల నుంచి జరిగే సత్యదేవుని గిరి ప్రదక్షిణతో మధ్యాహ్నం వరకూ అన్నవరం మెయిన్ రోడ్డు, రత్నగిరి ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ స్తంభించిపోయి భక్తులు చాలా ఇబ్బంది పడేవారు. గత ఏడాది కార్తిక పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణను మధ్యాహ్నం 2 గంటలకు మార్చి, ఎటువంటి ఇబ్బందీ లేకుండా నిర్వహించారు. గతంలో ఈఓగా పని చేసిన ఆయన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దేవస్థానానికి కమిషనర్ హోదాలో సహాయ సహకారాలు అందిస్తారనే అభిప్రాయం సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

నేతి కొనుగోళ్లపై దృష్టి సారించరూ..

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి ఆరోపణల నేపథ్యంలో అన్ని దేవస్థానాల్లో టెండర్ ద్వారా నేతి కొనుగోళ్లు నిలిపివేశారు. సహకార డెయిరీల నుంచే కొనుగోలు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానంలో తయారు చేసే గోధుమ నూక ప్రసాదంలో ఉపయోగించే ఆవు నెయ్యి కొనుగోలుకు ఏటా సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ దేవస్థానం ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం సహకార డైరీల కొనుగోలు చేస్తున్న నేతికి ఇంకా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో కిలో నెయ్యి టెండర్ ద్వారా రూ.584కే కొనుగోలు చేశారు. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి నెయ్యి సరఫరాకు టెండర్ పిలవగా అతి తక్కువగా కిలోకి రూ.484కు దాఖలైంది. అయితే, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆ టెండర్‌ను కాదని సంగం డెయిరీ నుంచి కిలో రూ.590కి కొనుగోలు చేస్తున్నారు. ఇది టెండర్ ధరకంటే రూ.106 అధికం. ప్రతి నెలా 10 వేల కిలోల నుంచి 15 వేల కిలోల వరకూ కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలలుగా ఈవిధంగా దాదాపు రూ.80 లక్షలు అధికంగా చెల్లించారు. ఈ నేపథ్యంలో నెయ్యి కొనుగోలుపై కమిషనర్ రామచంద్ర మోహన్ దృష్టి సారిస్తే దేవస్థానానికి మేలు జరుగుతుంది.

నిర్మాణాలకు నిధులేవీ !

దేవస్థానంలో రూ.90 లక్షలతో టోల్‌గేట్ నుంచి రత్నగిరికి రెండో మెట్ల దారి, రూ.20 కోట్లతో ఎస్ఆర్‌సీ సత్రం స్థలంలో 110 గదుల సత్రం, ఇంకా పశ్చిమ రాజగోపురం ముందు షెడ్డు నిర్మాణం వంటి పనులు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, అందుకు అవసరమైన నిధులు దేవస్థానం వద్ద లేని పరిస్థితి. దీని కోసం డిపాజిట్లు విత్‌డ్రా చేయాల్సి ఉంటుంది. దీనిపై కూడా రామచంద్ర మోహన్ ఇక్కడి అధికారులకు మార్గదర్శనం చేయాలని దేవస్థానం వర్గాలు ఆశిస్తున్నాయి.


మండపేట మండలం కేశవరం వద్ద రైల్వే గేటు వేసి ఉండగా చంటిబిడ్డతో గేటు దాటుతున్న మహిళ


సామర్లకోట స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ కోసం పట్టాలు దాటుతున్న ప్రయాణికులు


తుని రైల్వే స్టేషన్‌లో ఇలా..


నిడదవోలు రైల్వేస్టేషన్‌లో ఆదరాబాదరాగా..


రాజమహేంద్రవరంలో...

ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు. తోటివారికన్నా ముందుండాలని, సమయం కలిసొస్తుందని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించకుండా పట్టాలను దాటేస్తున్నారు. రైల్వే అధికారులు చేసే హెచ్చరికలను, ఇచ్చే సూచనలను పెడచెవిన పెట్టి అయినవారిని దుఃఖసాగరంలో ముంచే ఈ కంగారు అవసరమా అన్నది అందరూ ఆలోచించాల్సిన విషయం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గురువారం వివిధ స్టేషన్లలో ప్రయాణికులు ప్రాణాలు పణంగా పెట్టి ఇలా పట్టాలు దాటారు.

జోరుగా గొలుసుకొట్టు చోరీలు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చైన్ స్నాచింగ్‌లు
- నగలు ధరించి బయటకు వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న నేరస్తులు
- అదుపులో నలుగురు అనుమానితులు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో దొంగలు మరోసారి పేట్రేగిపోయారు. బుధవారం ఒక్కరోజే ఆరుచోట్ల చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గత ఏడాది చైన్ స్నాచింగ్ 22 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఒక్క నెలలోనే 7 కేసులు నమోదు కావడం గమనార్హం.

పుస్తెల తాళ్లు పక్కన పెడుతున్నారు

మహిళలు బంగారు నగలు ధరించడం హోదాగా భావిస్తారు. ఆలయాలకు, ఫంక్షన్లకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా నగలు ధరిస్తారు. అయితే జరుగుతున్న వరుస దొంగతనాలతో బంగారు నగలు ధరించడానికి భయపడుతున్నారు. బంగారు పుస్తెలతాడులు సైతం పక్కన పెట్టి పసుపు తాడుతో బయటకు వస్తున్నారు. జిల్లాలో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాల్లోను ఇదే విధంగా తరచుగా దొంగతనాలు జరుగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారింది.

పాత వారా.. కొత్త వారా?

జరుగుతున్న దొంగతనాలతో ఉమ్మడి జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైనా ఫలితం లేదు. నేరస్తులు హెల్మెట్ ధరించి ఈ చోరీలు చేస్తుండడం, పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటుండడంతో పాటు నేరం చేసిన వెంటనే క్షణాల్లో తప్పించుకుని వెళ్లిపోతున్నారంటే జిల్లాలోని వీధులు, రహదారులపై పూర్తి అవగాహన ఉండి ఉండాలి. జిల్లాలో నేరస్తులే ఈ చోరీలు చేస్తుండవచ్చని ఒక భావన. మరో పక్క అమలాపురం, కాకినాడ జిల్లాల్లోనూ ఇదే తరహా చోరీలు జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లాపై పూర్తి పట్టు ఉన్న వేరే ముఠా ఏదైనా ఈ నేరాలకు పాల్పడుతోందా అని పోలీసులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పాత నేరస్తులపై పూర్తి నిఘా

ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డ నేరస్తుల చిట్టాను ఇప్పటికే పోలీసులు బయటకు తీశారు. వారికి ఈ నేరాలతో ఏమైనా సంబంధం ఉందా, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, వారు ఏ ఫోన్ వాడుతున్నారు, నేరం జరిగిన సమయంలో ఆ ఫోన్ ఎక్కడ పనిచేస్తోంది తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నేరస్తులను త్వరగా పట్టుకోవాలి

గతంలో విజిబుల్ పోలీసింగ్ ఎక్కువగా ఉండేది. ఇటీవల కాలంలో అది తగ్గింది. ఇటీవల నగరానికి వచ్చిన డీజీపీ కూడా విజిబుల్ పోలీసింగ్ అవసరం లేదని, కేసుల పురోగతి, దర్యాప్తు విజిబుల్‌గా ఉండాలని అనడం గమనార్హం. ఈ విధానం సరైన విధానం కాదని ప్రజలు అనుకుంటున్నారు. రోడ్డు పైకి వచ్చినప్పుడు ఏదో మూల పోలీసు, పోలీసు వాహనం కనపడితే నేరం చేయడానికి వచ్చే నేరస్తుడు భయపడి ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటాడు. విజిబుల్ పోలీసింగ్‌లో ఉన్న ఉపయోగం అది. మళ్లీ దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. జరిగిన గొలుసు దొంగతనాలపై దర్యాప్తు ముమ్మరం చేసి నేరస్తులను త్వరితగతిన పట్టుకోవాలి. ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేరస్తులను పట్టుకుంటాం



గొలుసు చోరీలపై నిఘా పెట్టాం. జరుగుతున్న నేరాలు ఇక్కడి వారి పనా, వేరే రాష్ట్రం ముఠా చేసిందా అనేది దర్యాప్తులో తేలాల్సి వుంది. చోరీలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశాం. విజిబుల్ పోలీసింగ్ పెంచుతున్నాం. ఆలయాల వద్ద, ఫంక్షన్ హాళ్ల వద్ద మఫ్టీలో గస్తీని పెంచుతాం. మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయాల్లో మహిళలు 112 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందాలి. నేరం జరిగిన తర్వాత గగ్గోలు పెట్టడం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకుంటే నేరానికి ఆస్కారం ఉండదు.

–డి.నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

పోలీసుల అదుపులో చైన్ స్నాచింగ్ అనుమానితులు?

వరుస చైన్ స్నాచింగ్ చోరీల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం మరోసారి వరుస చోరీలు జరగడంతో బృందాలు అప్రమత్తమై నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాయి. చోరీలతో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న ఒక ముఠా రంపచోడవరం, సీలేరు మీదుగా ఒడిశా బోర్డర్‌లోకి ప్రవేశించినట్టు గుర్తించారు. నలుగురు అనుమానితులను బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

మారిన రైళ్ల వేళలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల సమయాలను మారుస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ రైల్వే డివిజన్‌లో విజయవాడ తర్వాత రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌గా కొనసాగుతోంది. నిత్యం జిల్లా మీదుగా 110 రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా సుమారు 50 వేల మంది ప్రయాణిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరంతోపాటు సామర్లకోట, కాకినాడ, తుని తదితర రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అయితే తాజాగా రైళ్ల సమయం మార్పు జరగడంతో మారిన రైళ్ల రాకపోకల సమయాలను ప్రయాణికులు గుర్తించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మారిన సమయాలు ఇలా

రైలు నంబరు	రాజమహేంద్రవరం		సామర్లకోట	
	పాత టైమ్	మారిన టైమ్	పాత టైమ్	మారిన టైమ్
22834 భువనేశ్వర్	06.45	06.20	05.25	04.45
13352 అలెప్పీ ధనబాద్	08.20	07.35	09.15	08.25
12718 రత్నాచల్	08.35	07.58	09.15	08.50
17249 తిరుపతి- కాకినాడ	09.50	08.40	10.45	09.30
12515 సిల్చార్ ఎక్స్‌ప్రెస్	15.45	15.10	----	-----
22643 పాట్నా	15.45	15.10	----	-----
12509 గౌహతి	15.45	15.10	----	-----
12842 కోరమండల్	16.10	15.30	17.50	17.05
22842 శంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్	17.05	16.25	17.50	17.05
22808 శంత్రాగచ్చి ఏసీ	17.05	16.25	17.50	17.05
12659 గురుదేవ్	18.00	17.25	18.50	18.05
17482 తిరుపతి-బిలాస్‌పూర్	22.25	21.40	23.10	22.20
17480 తిరుపతి- పూరి	22.25	21.40	23.10	22.20
12845 భువనేశ్వర్	17.20	16.40	16.30	16.00
18047 వాస్కో	15.35	16.05	-----	-----
17488 తిరుమల	17.40	17.05	01.05	12.30
17220 విశాఖ-మచిలీపట్నం	02.00	01.10	01.05	12.30
12755 భావనగర్	06.40	06.35	-----	(హాల్ట్ లేదు)
17206 షిర్డీ ఎక్స్‌ప్రెస్	07.15	06.05	06.25	05.30
12737 గౌతమీ	20.20	20.20	19.40	19.40
12775 కోకనాడ	21.00	21.00	-----	(హాల్ట్ లేదు)

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు


విలేకరులతో మాట్లాడుతున్న రాజా

పెద్దాపురం: స్నేహా ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు నిర్వహించనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జరిగే ఈ పోటీల వివరాలను ఆయన గురువారం విలేకరులకు తెలిపారు. మూడు రోజుల పాటు ఏడు నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు. తొలి రోజున కరీంనగర్ చైతన్య కళాభారతి 'ఖరీదైన జైళ్లు', పాలకొల్లు వారిచే నటీనట సంక్షేమ సమాఖ్య 'అనూహ్యం' నాటిక ప్రదర్శలు ఉంటాయన్నారు. 25వ తేదీన హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి 'స్వేచ్ఛ', బాపట్ల సహృదయ ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రమ్ హోం', వెలగలేరు వారి 'రాత' నాటిక ప్రదర్శనలుంటాయన్నారు. 26న అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం', హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి 'ఇది రహదారి కాదు', చంద్రమాంపల్లి స్నేహా ఆర్ట్స్ వారి 'చింత చచ్చినా' నాటక ప్రదర్శనలుంటాయన్నారు. ఈ సమావేశంలో యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరరావు, మంతెన సత్తిబాబు పాల్గొన్నారు.

బాధితురాలికి ఊరట

స్పందించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

నల్లజర్ల: అనంతపల్లిలో మూడు రోజులుగా గృహ నిర్బంధంలో ఉన్న మామిడి రూత్‌లక్ష్మికి ఊరట లభించింది. వృద్ధురాలు పడుతున్న ఇబ్బందులను వెల్లడిస్తూ 'ఇంటి నుంచి బయటకు వచ్చే దారేది' అంటూ 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన వార్తా కథనానికి కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత స్పందించారు. తక్షణం అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎస్.వి.నాయుడును ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ వై.రాధాబాయి, వీఆర్వో సురేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కనకదుర్గ, సుస్మిత ప్రియాంక బాధిత వృద్ధురాలు రూత్‌లక్ష్మిని కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎదురింటి యజమాని పాటంశెట్టి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతోను అధికారులు మాట్లాడారు. వ్యవహారం కోర్టులో ఉన్నా, తీర్పు వచ్చే వరకు ఇంతవరకు ఏవిధంగా దారి వినియోగించారో అదే విధంగా కొనసాగించాలని సూచించారు. ఇంటి గుమ్మం ముందు ముళ్లకంపలు వేసిన మిగతా ఇళ్లవారి వద్ద వివరాలు సేకరించారు. వృద్ధురాలిని ఇబ్బందులకు గురి చేయవద్దని ఆదేశించారు. ఆర్డీఓ ఉత్తర్వులను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



అనంతపల్లిలో గృహ నిర్బంధంలో ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లిన అధికారులు

'సూర్యఘర్' అమలుతో అరుదైన అవకాశం

యానాం: స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్న దంపతులు కామాడి గంగరాజు, నీలిమలకు సూర్యఘర్ పథకం అమలుతో ఈ నెల 26న న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలను వీక్షించే అవకాశం దక్కింది. వివరాలలోకి వెళితే మెట్టకూరు గ్రామంలో యానాం విద్యుత్‌శాఖ ప్రోత్సాహంతో 'అంప్లసోస్' అనే సంస్థ సహకారంతో రూ.2లక్షల 25వేలు(ఇందులో రూ.78వేలు సబ్సిడీ) పెట్టుబడితో 'పిఎం సూర్యఘర్ బిజిలీ యోజన స్కీం ద్వారా 3 కెడబ్ల్యు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మిగులు విద్యుత్‌ను యానాం గ్రిడ్‌కు పంపిణీ చేస్తున్నారు. 'మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ' అధికారులు పథకాన్ని పరిశీలించి గంగరాజు దంపతులను రిపబ్లిక్‌డే పరేడ్ వేడుకలకు ఎంపిక చేశారు. వారికి ప్రయాణ, వసతి ఏర్పాట్లను పుదుచ్చేరి, యానాం విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది.


సోలార్ ప్లాంట్ వద్ద గంగరాజు, నీలిమ దంపతులు

ఆదిత్య విద్యార్థుల వినూత్న ప్రయత్నం



జేఎన్‌టీయూకేలో ఆదిత్య నిర్వహించిన హ్యాండ్‌రైటింగ్ మారథాన్


హ్యాండ్‌రైటింగ్ మారథాన్‌లో పాల్గొన్న జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించడానికి కాకినాడ ఆదిత్య విద్యార్థులు వినూత్న ప్రయత్నం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, జాతీయ చేతి రాత దినోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకేలో గురువారం దాదాపు 2,200 మంది విద్యార్థులతో హ్యాండ్ రైటింగ్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య గ్రూప్ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్ర ఆదిత్య విద్యార్థులతో కలిసి రాయడమనేది చాలా గొప్పవిషయమన్నారు. ఆరు సంవత్సరాలుగా తమ విద్యార్థులు హ్యాండ్‌రైటింగ్ శిక్షణ పొందుతూ నైపుణ్యాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ నైపుణ్యంతో ఈసారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో చోటు పొందేందుకు వినూత్న ప్రయత్నం చేశారన్నారు. జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమానికి తమ వర్సిటీ వేదిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు. మూడవ అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, స్కూల్ డైరెక్టర్ శృతిరెడ్డి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీదిలీప్‌పాత్రో, సద్గురు అకాడమి చైర్మన్ మహాలక్ష్మి, సింగర్ కొండేపూడి యసశ్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఎందరో నిరుద్యోగుల కల నిజం చేస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ సేవలు మరువలేనివని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రతిష్టాత్మకంగా తయారుచేసిన పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ ఆరు నెలల కరెంట్ అఫైర్స్ పుస్తకాన్ని ఎస్పీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతీ వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఒక కల అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యంజేవి భాస్కరరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


నాగూర్ (ఫైల్)

అంబాజీపేట: స్థానిక అమెరికన్ ఆస్పత్రి సమీపంలో ఉన్న దొమ్మేటివారిపాలేనికి చెందిన పితాని నాగూర్ (103) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మండల తాపీ పనివార్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును పలువురు పరామర్శించారు.

యువతి కిడ్నాప్‌పై కేసు నమోదు

అయినవిల్లి: ఓ యువతి కిడ్నాప్‌పై గురువారం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ ఆర్. శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం సిరిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతిని అనకాపల్లి వద్ద నక్కపల్లికి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు పుడి సాయి బుధవారం రాత్రి ఆ యువతిని కిడ్నాప్ చేశాడు. పుడి సాయి కొంత కాలంగా అయినవిల్లి మండల పరిధిలో గ్రామాల్లో కొబ్బరి దింపు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. యువతి తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దాడి చేసిన ముగ్గురు యువకుల అరెస్ట్

అమలాపురం టౌన్: తప్పుకోమని మోటారు సైకిల్ హారన్ కొట్టిన కారణానికి ఒక యువకుడిపై అమానుషంగా దాడి చేసి గాయపరచడమే కాకుండా మోటర్ సైకిల్‌ను ధ్వంసం చేసిన ముగ్గురి యువకులను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. స్థానిక ఈదరపల్లి వంతెన సమీపంలో నవరప్పాలేనికి చెందిన దుర్గాప్రసాద్‌ను పరమట ఆనందరావు, పరమట సురేష్, బొర్లి వీర వెంకట సత్యనారాయణ దాడి చేసి గాయపర్చిన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ చెప్పారు. నిందితులను కొత్తపేట సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

బిందుశ్రీకి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు

యానాం: 69వ జూనియర్ జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ క్రీడా పోటీల్లో టీమ్ విభాగంలో ద్వితీయ, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును నీలపల్లికి చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ అందుకున్నారు. ఈ మేరకు గురువారం తూర్పుగోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పనస్వామి, తాళ్లరేవు మండల బాల్‌బ్యాడ్మింటన్ అసోయేషన్ అధ్యక్షుడు ఇసుకపట్ల అంబేడ్కర్ ప్రకటనలో తెలిపారు. శాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర నాగపూర్ జిల్లాలో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు పోటీలు సాగాయి.


బిందుశ్రీ